క్లుప్తంగా

సన్మానం



మహిళలను సన్మానిస్తున్న దృశ్యం

కల్లూరు: భగవద్గీత పారాయణంలో బంగారు పతకాలు సాధించిన మహిళలను విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచారక్ రాణాప్రతాప్, వీహెచ్‌పీ నాయకులు బొడ్డు కృష్ణ, మిట్టపల్లి జగదీష్, చలమాల వెంకటేశ్వరరావు, లక్కినేని ప్రసాద్, మోహనరావు, సత్యవాణి, కొమ్మూరి, దర్గయ్య, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న విజయ్

వైరారూరల్: ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఎస్‌పీసీ ఆధ్వర్యంలో ఈనెల 23న హైదరాబాద్‌లో ఇందిరాపార్కు వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి విజయ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించిన ఆయన మాట్లాడారు. పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, పదోన్నతి ప్రక్రియను కొనసాగించాలని, హెల్త్ కార్డుకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, మండల కృష్ణ, బ్రహ్మం, విజయ్‌కుమార్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న అంజయ్య

ముదిగొండ: ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేసేలా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని ఎంఎస్‌పీ (మహాజన సోషలిస్ట్ పార్టీ) జిల్లా అధ్యక్షులు తూరుగంటి అంజయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ముదిగొండలో వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు గుంజులూరి రాంబాబు అధ్యక్షతన వీహెచ్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్, సీపీహెచ్‌పీఎస్ మండల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 20న నేలకొండపల్లిలో పాలేరు నియోజకవర్గ వీహెచ్‌పీఎస్, సీపీహెచ్‌పీఎస్ ఐదు మండలాల దివ్యాంగుల చేయూత పెన్షన్‌దారుల మహాగర్జన సన్నాహక సభ ఉంటుందని, దీని విజయవంతానికి గ్రామాలను మూడు సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు.

అన్నదానం

సత్తుపల్లిరూరల్: ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పుట్టినరోజు వేడుకల్లో భాగంగా మంగళవారం ఎన్‌ఎస్‌యూ ఆధ్వర్యాన మండల పరిధిలోని చెరుకుపల్లిలో ఆదివాసీ గుత్తికొయ్యల కుటుంబాలకు అన్నదానం నిర్వహించారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్‌కాంగ్రెస్ సెక్రటరీ కన్నెకంటి లోకేష్, నియోజకవర్గ అధ్యక్షులు ఎ.సందీప్‌గౌడ్, సోషల్‌మీడియా ఇన్‌చార్జ్ వంశీ, ప్రశాంత్, తేజా, రాజా, యశ్వంత్, నవనీత్ పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

సత్తుపల్లి: నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు పొంది 18 నుంచి 59 ఏళ్ల వయస్సున్న రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ వై.శ్రీనివాసరావు మంగళవారం కోరారు. దరఖాస్తులను క్లస్టర్ పరిధిలోని ఏఈఓలకు అందించాలని తెలిపారు.

బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

ఎర్రుపాలెం: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గొల్లపూడి కోటేశ్వరరావు, నల్లమోతు హనుమంతరావు, దూదిగం బసవయ్య, ఆంగోతు వెంకటేశ్వర్లు, సగుర్తి సంజీవరావు, నాగులవంచ వెంకట్రామయ్య, షేక్ నాగుల్‌మీరా, కూడెల్లి నాగేశ్వరరావు, దివ్వెల వీరాంజనేయులు తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్యం వెక్కిరిస్తోంది..

- అధ్వానంగా డ్రెయినేజీలు
- మురికినీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతున్న వైనం
- ఖాళీ స్థలాల్లో నిండుగా నీరు..
- పాడుబడిన ఇళ్లతో పరేషాన్





ఇళ్ల పక్కన ఖాళీ స్థలంలో నిలిచిన వర్షపు నీరు, పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

తల్లాడ: మేజర్ పంచాయతీ తల్లాడలో పారిశుద్ధ్యం అగమ్యగోచరంగా తయారైంది. ఈ మేరకు డ్రెయినేజీ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రధాన, అంతర్గత రోడ్లకు సైడ్ డ్రెయిన్లు లేకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీలో నీటి సరఫరా సరిగ్గా జరగక ఎక్కడికక్కడే నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ప్రధాన రహదారికి మూడు వైపులా డ్రెయినేజీలు లేకపోవటంతో వర్షం వస్తే నీరంతా రోడ్ల పక్కన నిలిచి అసౌకర్యంగా మారుతుంది. కొత్తగూడెం రోడ్డు నుండి నేరుగా వరద నీరు బస్టాండ్‌లోకి చేరుతుంది. దీంతో తల్లాడలో దోమలు బాగా వృద్ధి చెంది రోగాలకు నిలయంగా మారింది. ఇటీవల డెంగీ జ్వరంతో యోగా టీచర్ మృతి చెందగా పలువురు వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. జ్వరాల ప్రభావం తీవ్రంగా కనిపిస్తోందని పాలకవర్గం లేకపోవటంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది.

డ్రెయినేజీల్లో నిలిచిన నీరు..

తల్లాడ రింగ్‌రోడ్డు సెంటర్ నుంచి గ్రామం లోపలికి వెళ్లేటప్పుడు ఉన్న డ్రెయినేజీలో నీరు నిలిచిపోతుంది. ఇందుకు కారణం గ్రామం లోపల మాత్రమే సైడ్ డ్రెయిన్లు ఉండి ప్రధాన రోడ్డులో లేకపోవడమే. అంతర్గత రహదారుల నుంచి ప్రధాన రహదారుల్లో మురికి నీరు బయటకు పోయే వీలు లేక దుర్గంధం వెదజల్లుతోంది. పంచాయతీ సిబ్బంది ప్రతీ 15 రోజులకొకసారి మురికి నీటిలో నిలిచిపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను బయటకు తీసి కాల్వలను శుభ్రం చేయాల్సి వస్తుంది. కాల్వలను సిబ్బంది శుభ్రం చేసినా వారం రోజుల్లోనే మళ్లీ యథాస్థితికి చేరి ప్రజలకు అసౌకర్యంగా కలిగిస్తున్నాయి.

చెరువులను తలపిస్తున్న ఖాళీ స్థలాలు..

పలు వీధుల్లో ఖాళీగా ఉన్న స్థలాల్లో వర్షం నీరు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఖాళీ స్థలాల్లో మురికి నీటితో పాటు పిచ్చి చెట్లు, గడ్డి మొక్కలు దట్టంగా పెరిగి పాములు, తేళ్లు సంచరిస్తున్నాయి. మురికినీరు, చెత్తాచెదారం బాగా ఉండటంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

ప్రమాదకరంగా శిథిల గృహాలు..

పంచాయతీలో పలు చోట్ల శిథిలావస్థలో ఉన్న ఇళ్లు వాడకంలో లేకుండా వదిలేయటంతో పారిశుద్ధ్యం లోపించింది. శిథిలావస్థలో ఉన్న ఇల్లు ఎప్పుడు కూలతాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఏళ్ల తరబడి వాడకుండా వదిలేసిన ఇళ్లు, ఆవరణలో దట్టంగా పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో విషసర్పాలు సంచరిస్తున్నాయి. వీటిని పంచాయతీ సిబ్బంది నోటీసులిచ్చి తొలగించాల్సి ఉంది. తల్లాడలో ఎన్ఎస్‌పీ క్వార్టర్స్ 40 ఏళ్ల క్రితం నిర్మించగా అవి కూడా శిథిలావస్థకు చేరాయి. ఏళ్ల తరబడి వాటిని కూడా వదిలేయటం వల్ల ప్రమాదకరంగా తయారయ్యాయి.

నీటి నిల్వతో దుర్వాసన..



ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తోంది. గ్రామ పంచాయతీ వారికి పలు మార్లు చెప్పినా పట్టించుకోవటం లేదు. దీంతో వ్యర్థాలు చేరి, దోమలకు నిలయంగా ఉన్నాయి. వ్యాధులు వ్యాప్తి చెందేలా ఉన్నాయి. నీరు నిల్వ ఉండకుండా పంచాయతీ వారు చర్యలు తీసుకోవాలి

– కోసూరి వేలాద్రి, శ్రీ నగర్ కాలనీ, తల్లాడ

డ్రెయినేజీలు నిర్మించాలి



తల్లాడ మేజర్ పంచాయతీలో డ్రెయినేజీలు నిర్మించాలి. అవి లేకపోవటంతో వర్షం నీరు, మురికి నీరు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. దీంతో దోమలు, పందులు సంచరిస్తున్నాయి. తల్లాడ పంచాయతీ వారు పట్టించుకుని సైడ్ కాల్వలు తవ్వించి, చెత్తాచెదారాన్ని తొలగించాలి.

– ముక్కా రామకృష్ణ, తల్లాడ

చర్యలు తీసుకుంటున్నాం

మేజర్ పంచాయతీలో డ్రెయినేజీలు కొన్ని వీధులకు అసలు లేవు. ప్రధాన రహదారికి కూడా సైడ్ డ్రెయిన్స్ లేవు. అంతర్గత రహదారుల్లో ఉన్న డ్రెయినేజీల్లో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. ఖాళీ స్థలాల్లో దట్టంగా చెట్లు మొలవటంతో వారికి నోటీసులు ఇచ్చాం. శిథిలావస్థలో ఉన్న ఇళ్ల వారికి కూడా తొలగించాలని నోటీసులిచ్చాం.

– కృష్ణారావు, తల్లాడ పంచాయతీ ఈఓ

దోమకాటుతో.. పల్లెలు విలవిల

- మూలన పడ్డ ఫాగింగ్ మిషన్లు



మూలనపడ్డ ఫాగింగ్ మిషన్

కొణిజర్ల: పారిశుద్ధ్య నిర్వహణ, దోమల నివారణకు గాను మండలంలోని పలు పంచాయతీలలో గతంలో కొనుగోలు చేసిన ఫాగింగ్ మిషన్లు కానరాకుండా పోయాయి. కొన్ని పంచాయతీలలో మిషన్లు చెడిపోగా మరి కొన్ని ఆనవాళ్లు కూడా లేవు. దీంతో మండలం దోమల స్వైర విహారంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. మండలంలో ప్రతీ పంచాయతీకి రూ.35 వేలు విలువ చేసే ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేశారు. వాటిని సరైన భద్రత లేకపోవడంతో చెడిపోయాయి. దీంతో యంత్రాలను మూలన పడేశారు.

అరణ్యాలను తలపిస్తున్న ఖాళీ స్థలాలు..

గ్రామాలలో ప్రతీ వీధిలోని ఖాళీ స్థలాలలో పిచ్చి మొక్కలు పెరిగి అడవులను తలపిస్తున్నాయి. దీంతో దోమల వ్యాప్తి పెరిగి ప్రజల జ్వరాల బారిన పడుతున్నారు. స్థల యజమానులు వాటిని బాగు చేయించకపోవడం, పంచాయతీ అధికారులు పట్టించుకుని వారికి నోటీసులు జారీ చేయడం వంటివి కూడా చేయడం లేదు. దీంతో చెట్లు విపరీతంగా పెరిగి దోమల వ్యాప్తి పెరిగింది.

ఫాగింగ్ ఖర్చు భరించేది ఎవరు..?

పంచాయతీలలో దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలంటే మిషన్లు బాగు చేయించాలి. దానిని నడిపించడానికి డీజిల్, దోమల మందు కొనుగోలు చేయాలి. ఇవన్నీ గతంలో సర్పంచ్‌లు భరించి తర్వాత బిల్లులు పెట్టుకునేవారు. ఇప్పుడా భారం పంచాయతీ కార్యదర్శులపై పడింది. దీంతో వారు ఖర్చు భరించలేక చేతులెత్తేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అత్యవసర నిధులు కేటాయించి ఫాగింగ్ చేయించి దోమల బారి నుంచి ప్రజలను కాపాడాలని కోరుతున్నారు.

ఫాగింగ్ చేయిస్తాం..



మండలంలోని 12 పంచాయతీలలో ఫాగింగ్ మిషన్లు పనిచేస్తునేఉన్నాయి. మిగిలిన పంచాయతీలలో రిపేర్‌లో ఉన్నాయి. పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వ నిధులు మాత్రమే వస్తుండటంతో అవి జీతభత్యాలకే సరిపోతున్నాయి. రెండు మూడు రోజుల్లో ఫాగింగ్ చేయిస్తాం.

– ఆర్ ఉపేంద్రయ్య, ఎంపీడీఓ, కొణిజర్ల

పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

కారేపల్లి: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినపల్లి మస్తాన్, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి వై.జానకిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 19 నెలలు కావస్తున్నా రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయటంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. విద్యా కమిషన్ పేరుతో కాలయాపన చేయకుండా, త్వరితగతిన ఆయా పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని, విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజయ్, అఖి, చందూ, వేణు, ఉషశ్రీ, సంధ్య, సాయి, అఖిల్, హేమంత్, ప్రవీణ్, జస్వంత్, రాజశేఖర్, వినయ్ తదితరులు ఉన్నారు.

వైఎస్.జగన్‌ను కలిసిన సురేంద్రరెడ్డి



జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సురేంద్రరెడ్డి

సత్తుపల్లి: ఏపీ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని సత్తుపల్లికి చెందిన విజయ ఇండస్ట్రీస్ అధినేత పునూరు సురేంద్రరెడ్డి మంగళవారం కలిశారు. తాడేపల్లిలోని జగన్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన పుష్పగుచ్ఛం అందజేశారు.

మున్సిపాలిటీ కార్మిక సంఘం కమిటీ ఎన్నిక

కల్లూరు: కల్లూరు మున్సిపాలిటీ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఊడల కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కె.వజీర్ మియా, ఉపాధ్యక్షురాలుగా గొల్లమందల యశోధ, గౌరవాధ్యక్షులుగా వేము రాంబాబు, గౌరవ సలహాదారులుగా దామాల దయాకర్, కార్యదర్శిగా చింతపల్లి శ్రీను, కోశాధికారిగా కంభంపాటి ప్రకాష్, కార్యవర్గ సభ్యులుగా సుధాకర్, ప్రవీణ్, అంజలి, మరియమ్మ, రాంబాబు మరో 9 మంది ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

బెదిరించిన ఘటనపై కేసు

చింతకాని: మండలంలోని కోమట్లగూడెంకు చెందిన రాచబంటి చంద్రయ్యపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన జక్కుల వెంకయ్య వ్యవసాయ భూమిలోకి ప్రవేశించిన చంద్రయ్య పంట కాల్వ తవ్వుతుండడంతో వెంకయ్య ప్రశ్నించాడు. దీంతో కర్రతో కొట్టి చంపుతానని బెదిరించగా ఆయన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు



కొణిజర్ల: నివాళులర్పిస్తున్న విద్యార్థులు, కళాశాల సిబ్బంది



బోనకల్‌లో..

బోనకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ గ్రంథాలయ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ నళినిశ్రీ మాట్లాడుతూ.. గ్రంథాలయ ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు లక్ష్మీకాంతం, పద్మావతి, ప్రేమ్‌కుమార్ రెడ్డి, అంతోటి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం గ్రంథాలయ పాలకుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కె.రజని, లైబ్రేరియన్ బి.మమత గ్రంథాలయ పితామహుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ పార్వతి, అసిస్టెంట్ లైబ్రేరియన్ రాజేశ్వరి, వైస్ ప్రిన్సిపల్ యం.నవ్య, కోఆర్డినేటర్లు ఐశ్వర్య, దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

నారుమడికి కలుపుమందు కొట్టినందుకు..

చింతకాని: మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామానికి చెందిన గోనె సైదమ్మ, ఆమె కుమార్తె రుచితలపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోనె శ్రీనివాసరావు కుటుంబసభ్యుల మధ్య భూ వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో శ్రీనివాసరావు వరి నారుమడిపై తన వదిన సైదమ్మ, ఆమె కూతురు రుచిత కలుపు మందు పిచికారీ చేయడంతో నారుమడి ఎండిపోయింది. ఈ మేరకు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

పోటీ పరీక్షల్లో విజయం సాధించండి..

- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిటౌన్: ప్రతీ ఒక్కరు పోటీ తత్వాన్ని అలవర్చుకొని కష్టపడి చదివి పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. స్థానిక బండిపార్థసారథిరెడ్డి గ్రంథాలయానికి మున్సిపాలిటీ ఆధ్వర్యాన రూ.28 వేల విలువైన పోటీ పరీక్షల పుస్తకాలను మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఉద్యోగాలను భర్తీ చేస్తూ నిరుద్యోగుల జీవితాల్లో వెలుగు నింపుతుందన్నారు. పోటీ పరీక్షల పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కిష్టారం నర్సింగ్ కళాశాల విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. 94 శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను, కళాశాల ప్రిన్సిపాల్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహా, దోమ ఆనంద్, గాదె చెన్నారావు, ఎండి.కమల్‌పాషా, శివవేణు, తోట సుజలరాణి, మేనేజర్ మైసా శ్రీనివాసరావు, లైబ్రేరియన్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం..



ఎర్రుపాలెం: నాటు వేస్తున్న మల్లు నందిని

ఎర్రుపాలెం/చింతకాని: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని డిప్యూటీ సీఎం భట్టి సతీమణి మల్లు నందని కోరారు. ఈ మేరకు మంగళవారం ఎర్రుపాలెం మండలంలోని జమలాపురంలో, చింతకాని మండలంలోని నాగులవంచ గ్రామంలో జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సమావేశాల్లో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రాయల నాగేశ్వరావు, నాయకులు బండారు నర్సింహారావు, చావా రామకృష్ణ, నూతి సత్యనారాయణ, దొబ్బల సౌజన్య, నాయకులు గజ్జెలి వెంకన్న, పుచ్చకాయల వీరభద్రం, వేజెండ్ల సాయికుమార్, బొందయ్య, మొక్క శేఖర్‌గౌడ్, అంబటి వెంకటేశ్వర్లు, తుమాటి నవీన్‌రెడ్డి, అనుమోలు కృష్ణారావు, తల్లపురెడ్డి నాగిరెడ్డి, కన్నెబోయిన గోపి, కూరపాటి కిషోర్, మడుపల్లి భాస్కర్, కొప్పుల గోవిందరావు, బొర్రా ప్రసాద్, ఆలస్యం బస్వయ్య, వీరభద్రం, తిరీషా, ప్రగతి, తదితరులు ఉన్నారు.

కూలీలతో కలిసి వరినాట్లు

ఎర్రుపాలెం మండలంలోని మీనవోలులో మధిర –విజయవాడ రహదారి పక్కన పలువురు కూలీలు వరి నాట్లు వేస్తుండగా.. డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందిని సైతం వారితో జత కలిశారు. కూలీలతో మాట్లాడి కాసేపు నాట్లు వేశారు.

నిరుపేద విద్యార్థినికి ల్యాప్‌టాప్

మధిర: వైరా మండలం స్నానాల లక్ష్మీపురం గ్రామానికి చెందిన తాళ్లూరి పుల్లారావు కుమార్తె గీతకు అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క ల్యాప్‌టాప్ అందజేశారు. పేద కుటుంబానికి చెందిన గీత ఇంజనీరింగ్ చదువుతుండగా మధిరలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ల్యాప్‌టాప్ అందజేశారు. శ్రీనివాసరెడ్డి, సాయికుమార్, నవీన్‌రెడ్డి ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమమే మార్గం



మాట్లాడుతున్న రాంబాబు

సత్తుపల్లిరూరల్: తెలంగాణ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి ఐక్య ఉద్యమమే మార్గమని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. మంగళవారం సత్తుపల్లి మండలం కాకర్లపల్లిలో సంఘం మండల మహాసభ బాల బుచ్చయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్విట్ కార్పొరేట్ నినాదంతో దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు నేడు(బుధవారం) నిర్వహించనున్న రైతులు నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మాచినేని రమేష్ మాట్లాడుతూ... జిల్లాలో యూరియా సరఫరాలో కోత లేకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, నాయకులు తాతా భాస్కర్‌రావు, శీలం సత్యనారాయణరెడ్డి, జాజిరి శ్రీనివాసరావు, రావుల రాజబాబు, పామాయిల్ రైతు సంఘం రాష్ట్ర నాయకులు తుంబూరు మహేశ్వరరెడ్డి, మొరంపూడి పాండురంగారావు, జాజిరి జ్యోతి, కె.సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా యూజీడీ పనులు



పనులను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

మధిర: కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల మధిర మున్సిపాలిటీ పరిధిలోని అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని బీజేపీ పట్టణ అధ్యక్షులు శివరాజు సుమంత్ అన్నారు. స్థానిక 16వ వార్డులో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను మంగళవారం బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పైపుల కోసం తీసిన గుంతలను పూడ్చకుండా వదిలేయడంతో వర్షానికి నీళ్లు చేరి ఆ గుంతల్లో పడి ప్రజలు గాయపడుతున్నారన్నారు. కాంట్రాక్టర్ ఒక రోడ్డులో పైప్‌లైన్ పనులు పూర్తి చేసిన తర్వాతనే మరో రోడ్డులో పనులను ప్రారంభించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గడ్డం శ్రీహరి చౌదరి, జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, నాయకులు మర్సకట్ల స్వర్ణాకర్, పాపట్ల రమేష్, పగడాల నాగేంద్రబాబు, బియ్యవరపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం


ఎర్రుపాలెం: మండలంలోని వెంకటాపురంలో మంగళవారం బనిగండ్లపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ప్రశాంత్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శ్రీలక్ష్మి, వైద్య సిబ్బంది సాయిరెడ్డి, కుమారి, అరుణ ఉన్నారు.

చింతకాని: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఆల్తాఫ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నేరడ, లచ్చగూడెం, సీతంపేట గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటి సర్వే నిర్వహించి నీటినిల్వలు తొలగించి దోమల నివారణ మందును పిచికారీ చేశారు. రోగులను పరీక్షించి మందుల్ని పంపిణీ చేశారు. వైద్యులు వెంకటేశ్వరరావు, అనిల్, సోహెల్, సీహెచ్‌ఓ వీరేందర్, హెల్త్ సూపర్‌వైజర్లు నాగేశ్వరరావు, కృష్ణారావు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు సుజాత, లేయమ్మ ఉన్నారు.


ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చింతకాని: మండల పరిధిలోని తిమ్మినేనిపాలెం మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండలకేంద్రంలో మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

ఉధృతంగా బండిరేవు వాగు ప్రవాహం



చింతకాని : నాగులవంచ వద్ద వాగు ఉధృతి



బోనకల్ : నీరు నిలిచిన పత్తి పంటను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

చింతకాని: పలు ప్రాంతాల్లో సోమవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి చింతకాని మండలం నాగులవంచ వద్ద పాతర్లపాడు వెళ్లే ప్రధాన రహదారిపై బండిరేవు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రధాన రహదారిపైకి నీరు చేరడంతో రెవెన్యూ అధికారులు, పోలీసులు అప్రమత్తమై రాకపోకలు నిలిపేశారు. ఏటా వర్షాకాలంలో ఇదే పరిస్థితితో నాగులవంచ రైల్వేకాలనీ, పాతర్లపాడు, బోనకల్ మండలం రామాపురం, గార్లపాడు, లక్ష్మీపురం, గోవిందాపురం(ఎల్) గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బండిరేవు వాగు వద్ద రహదారిపై బ్రిడ్జి నిర్మాణ ప్రతిపాదనలు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టిలో ఉన్నందున త్వరగా నిర్మాణానికి కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పొలాల్లోకి చేరిన నీరు

బోనకల్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బోనకల్‌లోని పలువురు రైతుల వరి, పత్తి పొలాల్లోకి నీరు చేరింది. ఈమేరకు నష్టపోయిన నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కోరారు. బోనకల్‌లో పొలాలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ పొలాల్లో నీటిని బయటకు పంపించేందుకు ఆయిల్ ఇంజన్లను ఉపయోగిస్తుండగా, పూత, కాయ రాలడంతో నష్టం ఎదురవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకేన పవన్, యార్లగడ్డ రమేష్, రైతులు మరీదు నాగేశ్వరరావు, మందా రాము తదితరులు పాల్గొన్నారు.